
# స్తువా స్తువా



గృహ గృహ స్తయిన తర్వాత దానికి సంపూర్ణమైన నిర్వచనాన్నిచ్చే ఉద్దేశ్యంతో గృహయజమాని కావాలనుకొని, అదే మాట అర్ధాంగి గృహితో చెప్పాడు.

"అంటే మీ ఉద్దేశ్యం ప్రస్తుత యజమానిని నేననా? నా మాటెప్పుడు చెల్లింది కనక?" అంటూ గృహి ఓ విసురు విసిరింది.

అప్పుడు విశదంగా చెప్పాడు సొంతిల్లు కట్టుకొంటే బావుంటుందనీ, దాంట్లో అమె సర్వాధికారిణిగా ఉండొచ్చనీ. "ఇప్పటికే మీ స్థాయికి మించిన కట్నమిచ్చి మా నాన్న చేతులు కాల్చుకున్నాడు. కనీసం ఇప్పుడున్న స్థాయిని మరో రెండు మెట్లు పైకి ఎక్కించే విధంగా ఇల్లు కట్టడం మంచిదే" అని మరో విరుపు విరిచి, భర్తని ప్రోత్సహించింది.

## ఎలక్ట్రాన్

ఆ రోజు చతుర్దశి అని ఖాతరు చెయ్యకుండా బ్యాంక్ నుండి ఋణం కోసం ధరఖాస్తు పత్రాలు తీసుకొచ్చాడు. వాటిని రాత్రల్లా కూర్చుని జాగ్రత్తగా పూర్తిచేసి మర్నాడు అమావాస్య రోజున బ్యాంక్‌లో దాఖలా చేశాడు. "మంచి రోజు చూసుకోవద్దా?" అని ప్రశ్నించింది గృహి.

"ఆశ్లేష నక్షత్రం అత్తగారికి గండమంటారు. అయినా నిన్ను చేసుకున్నానా లేదా? మా అమ్మకేం, గుండురాయిలా ఉంది. నేను హేతువాదినన్న సంగతి మరవకు" గృహ గృహిని సున్నితంగా మందలించాడు.

గృహ బ్యాంక్ చుట్టూ వరసగా నాలుగు రోజులు చక్కర్లు కొట్టి, విసుగెత్తి, అయిదో రోజున బ్యాంక్ ప్రాంతియ కార్యాలయానికి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు.

పెద్దాఫీసు మేనేజరు బ్రాంచి మేనేజరుకి ఫోన్ చేసి, "అప్పు తీసుకునేవాళ్ళని తిప్పించే రోజులు పోయి, ఆహ్వానించే రోజులొచ్చాయి. ఇలా తిప్పించడం మన వ్యాపారానికి మంచిది కాదు" అని చిన్నగా చివాట్లేశాడు.

"అదికాదు సార్! ఆయన చతుర్దశినాడు ఫారం తీసుకొని, అమావాశ్యనాడు సబ్మిట్ చేశాడు. ఇవ్వననడానికీ తీసుకోననడానికీ ఇది మంచి రోజు

కాదంటే రాద్ధాంతం జరుగుతుంది. అందుకనే మన బ్యాంక్ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, అక్షరసంఖ్యా శాస్త్రాన్ని ధర్మసూక్ష్మంగా తీసుకొని ఈ జులై పదమూడో తారీఖు, నవమి రోజు ఆయన లోన్ శాంక్షన్ చేస్తాను. ఇంకెంత నాలుగు రోజులు ఆయన మళ్ళీ ఫోన్ చేస్తే చెప్పండి" అన్నాడు బ్రాంచి మేనేజరు.

"అయిందేదో అయిపోయింది కానీ, ఇక ముందు మట్టుకు ఇలాంటి పెద్ద ఋణాల లావాదేవీల్ని పదమూడో తారీఖున మట్టుకు చెయ్యకు" అని పెద్దాయన ఫోన్ పెట్టేశాడు.

ఋణం మంజూరైన తర్వాత గృహ్ ఆ ఊళ్ళో తనకు కాస్త పరిచయమున్న ఓ సివిల్ ఇంజనీర్ విశ్వకర్మ దగ్గరకు వెళ్ళి తను కలలు కన్న గృహమెలా ఉండాలో చెప్పి, తనకున్న ఆర్థిక వనరుల సంగతిని వివరించాడు. సదురు విశ్వకర్మ ఈ వివరాల్నే కాకుండా గృహ్, గృహిల జన్మ తేదీల వివరాన్ని కూడా కంప్యూటర్‌లో ఫీడ్ చేసి ఓ బటన్ నొక్కాడు. పది సెకన్లలో కంప్యూటర్ స్క్రీన్ మీద ఓ ప్లాన్ ప్రత్యక్షమైంది. పై రెండు మూలల్లో గృహ్, గృహిల జాతక చక్రాలొచ్చాయి. కింద ఒక మూలలో మార్కెట్ ప్రస్తుత రేట్ల ఆధారంగా ఎస్టిమేట్ వచ్చింది.

"మీ ఇద్దరి జాతక రీత్యా, వాస్తుశాస్త్ర రీత్యా, మీ బడ్జెట్ హద్దుల్లో ఉండే దివ్యమైన ప్లానిది. మంజూరైన ఋణానికొక్క పైసా ఎక్కువ కాదు. నేనూ, వాస్తురత్న సుబ్బరాయ సిద్ధాంతీ కలిసి రాసిన సాఫ్ట్‌వేరిది" అన్నాడు విశ్వకర్మ గొప్పగా.

"నాకు వాస్తు మీద నమ్మకం లేదు. అసలు వాస్తు నియమాన్ని ఉల్లంఘిస్తూ యిల్లు కట్టాలన్నదే నా ధ్యేయం" అన్నాడు గృహ్ మరింత గొప్పగా.

"అసలు ఉత్తర దక్షిణాలుగా ఉన్న వీధిలో తూర్పు ముఖం స్థలం దొరకడమే చాలా అదృష్టం. అటువంటి స్థలంలో అదృష్టాన్ని పంపించుకోక ఇలాంటి విపరీత ధోరణిలో పోవడం ఆశ్చర్యంగా ఉంది. అయినా కట్టించుకునేవాడి ఇష్టాన్ని కాదనడం నాకిష్టం కాని పని. మీరడిగినట్టుగానే చేద్దాం" అంటూ, విశ్వకర్మ నూట ఎనభై డిగ్రీలు తిరిగే ఆజ్ఞని కంప్యూటర్ మహాశయుడికి జారీచేశాడు. ప్లాన్ గిర్రున నూట ఎనభై డిగ్రీలు తిరిగి, నాలుగు మూలలా నాలుగు ఎర్రటి నక్షత్రాలు మిణుకు మిణుకు మనసాగాయి.

"అవేమిటి?" గృహ్ కుతూహలంగా ప్రశ్నించాడు.

"ఒక్కొక్క ఎఱ్ఱ నక్షత్రం పాతిక శాతం వాస్తు విరుద్ధతని సూచిస్తోంది. పశ్చిమ ముఖంగా తిరిగిన ఈ ప్లాన్ నూటికి నూరు శాతం వాస్తు విరుద్ధం" అన్నాడు విశ్వకర్మ.

"బావుంది, దీన్నే ఖరారు చెయ్యండి" అన్నాడు గృహ్.

"చేస్తాను కానీ, ఇటువంటి ప్లాన్ గీసిచ్చినందుకు నాకూ సుబ్బరాయ సిద్ధాంతికీ చెడ్డ పేరొస్తుంది. అందుకు పరిహారంగా మరో వెయ్యి రూపాయలదనంగా ఇచ్చుకోవాలి లేకపోతే సిద్ధాంతి ఊరుకోడు"

## బ్రతుకు పాట



చెట్టు చేమ ఊపిరయితే
చుట్టుపక్కల పచ్చగ వుంటే
కొమ్మకొమ్మన కోయిల కూయగ
గుండెలోన వీణలు మ్రోగ
తళతళలాడే ఆకులలోన
తనువులొకటై కలిసిపోనీ
చెట్టును కొట్టకండీ బాబూ
చెట్టుతల్లి కంట నీరు చిందేను
ఆ తల్లి మురిపాల ఒడిలో
పాలుగారు పసిపాపలమయితే
పులకలతో భూమాత పులకరిస్తే
పూల అందం కనుల నిండనీ
పళ్ళ రుచులు నోరూరనీ
కొడవలి పట్టిన కరకు చేతిన
కుండల నిండుగ నీళ్ళు ఒంపి
కళకళలాడే కొమ్మల మాటున
తనువు వూగనీ
బ్రతుకు పాట సాగనీ

**- రోహిణీ సత్య**

గృహ్ దానికొప్పుకున్నాడు. నవ్వుతూ ఓ మాట వదిలాడు. "మీ ఇళ్ళ వాస్తు మంచిదే అనుకోవాలి, అదనంగా వెయ్యి సంపాదించారు"

"మీరన్న మాట ఎందుకు కాదనాలి? నేనూ ఓ సంగతి చెప్పనా? ప్లాన్ సమయంలోనే ఈ ఇల్లు మీ చేత అదనంగా వెయ్యి ఖర్చుపెట్టిస్తోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మరోసారి ఆలోచించుకోండి" అన్నాడు విశ్వకర్మ చిద్విలాసంగా నవ్వుతూ.

"మీలాంటి నిపుణులకదనంగా వెయ్యిచ్చినా పర్వాలేదనుకుంటాను" అన్నాడు గృహ్.

"సరే నీ ఖర్మ" అని లోపల అనుకొని, "సరే మీ ఇష్టం" అని పైకంటూ, విశ్వకర్మ కంప్యూటర్ ప్రింట్లతో, ఎస్టిమేట్లనీ, జాతక చక్రాన్నీ, ప్లాన్‌నీ విడివిడిగా యిచ్చాడు. ప్లాన్ మీద సంతకం చేసి సీలు కూడా వేశాడు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసరు తన దగ్గరకే తిన్నగా వచ్చేసిన గృహ్‌ని నఖశిఖ పర్యంతమూ చూసి, అతను తీసుకు వచ్చిన ప్లాన్‌ని దీక్షగా చూశాడు.

"ఈ ప్లాన్ విశ్వకర్మగారు వేసిచ్చారంటే నమ్మలేకుండా ఉన్నాను. దీన్ని అప్రూవ్ చెయ్యడం సాధ్యం కాదు" అన్నాడు టి.పి.ఓ.

"ముందు ముందు మునిసిపాలిటీవారు డ్రైనేజి కాలవలు కట్టినా, దానికోసమని ప్రహరీగోడని నా స్థలంలోనే పన్నెండంగుళాలు లోపలికి జరిపాను. ఇరుగుపొరుగుల స్థలాన్ని ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదు. ప్రహరీగోడలకీ, ఇంటికీ మధ్య ఉండవలసిన దూరాల నిబంధనల్ని పాటించాను. ఏ విధంగానూ మునిసిపాలిటీవారి నిర్మాణ నియమాన్ని ఉల్లంఘించని ప్లాన్ ఇది. ఎందుకు ప్రూవ్ చెయ్యరు?" గృహ్ గట్టిగా అడిగాడు.

"వాస్తు విరుద్ధం సార్. వాస్తు విరుద్ధం. ఒక్క తాగుబోతు కారణంగా ఇంటి గౌరవం చెడ్డట్లుగా, అవాస్తు గృహం వీధి పొందికనీ, ఊరి వాస్తునీ దెబ్బ తీస్తుంది."

"అలాంటి నమ్మకాలు నాకు లేవు. ఈ ప్లాన్ విషయమై మీరభ్యంతరాలు తెలిపితే ఛాందసాన్ని జనాల మీద రుద్దుతున్నారని పత్రికలకు ఉత్తరాలు రాస్తాను" అన్నాడు గృహ్.

టి.పి.ఓ. రూటు మార్చాడు, కందకు లేని దురద కత్తిపీట కెందుకనుకుంటూ" కింద నున్న గుమాస్తాలేవేవో కొర్రీలు పెట్టేస్తారు. అన్నింటినీ, అందర్నీ కాదనే పరిస్థితి కాదు నాది" అన్నాడు నర్మగర్భంగా.

గృహ్‌కీ ఎప్పుడు పట్టు విడవాలో తెలుసు. అవినీతి అన్ని మతాలకీ అతీతమైనది. అక్రమమైన పన్లకే కాదు, సక్రమమైన పన్లకు కూడా సంభావనలిస్తే కాని ముందుకు జరగవు. మొదటిది లంచం. రెండోది కృతజ్ఞతాపూర్వకమైన బహుమానం. ఇద్దరి చేతులూ బల్ల కింద కలిశాయి. మూడో రోజుకల్లా గృహ్ చేతికి అప్రూవ్డ్ ప్లాన్ వచ్చింది.

ఆ ప్లాన్‌తో మళ్ళీ విశ్వకర్మ దగ్గరకు వెళ్ళాడు. ఆయన పర్యవేక్షణలో అనుభవజ్ఞుడైన ఓ కంట్రాక్టర్ కమ్ మేస్త్రీ ఇంటి నిర్మాణం కావించే ఏర్పాటు చేసుకున్నాడు. లేబర్ ఛార్జీలింతా అని ఒప్పందం కుదిరింది. మేస్త్రీ తన మూతా మీద అజమాయిషీ చేస్తూ ఇల్లు కట్టిస్తాడు. తనకింక లేబర్ విషయమై తలనొప్పి లేదు. గృహ నిర్మాణానికి కావలిసిన స్టీలూ, సిమెంటూ, యిటుకలూ, యిసుకా, చిన్న కంకరా, పెద్ద కంకరా వగైరాలన్నీ ఓ షెడ్యూల్ ప్రకారం గృహ్ కొని ఇస్తాడు.

విశ్వకర్మ షెడ్యూల్ ఇచ్చాడు. సప్లయ్ కంపెనీల పేర్లూ, ధరల వివరాలూ యిచ్చాడు. అవసరమొస్తే తన పేరు చెప్పమన్నాడు. విశ్వకర్మ కంప్యూటర్ గృహ్, గృహి జాతకరీత్యా శంఖు స్థాపన, గృహ ప్రవేశాల ముహూర్తాలని నిర్ధారించి ప్రింటవుట్నిచ్చింది.

"నాకు వీటిమీద నమ్మకం లేదు" అన్నాడు గృహ్ మరోమారు.

"ఇంజనీరుగారి ఫీజులో ఇవన్నీ ఉచితం. నమ్మకాలు మీకు లేకపోయినా మాకుంటాయి. మేం కట్టే ప్రతి యింటి వాస్తు ప్రభావమూ మా వ్యాపారం మీద పడుతుంది. శంఖుస్థాపన జరిగే గొయ్యిలో యిల్లు కట్టించే యజమానితోబాటు ఇల్లు కట్టిచ్చే మేస్త్రీ కూడా పూజ చేస్తాడు. మీరు

**(మిగతా 9 వ పేజీలో చూడండి)**

# స్తువాస్తువా కథ

(7వ పేజీ తరువాయి)

చెయ్యడం మానినా, నేను చెయ్యక తప్పదు"" అన్నాడు మేస్త్రీ.

"నీ సెంటిమెంట్‌ని నేనెందుకు కాదనాలి? అయితే నైఋతిలో శంఖుస్థాపన చెయ్యండి" అన్నాడుగృహ్.

"మీకు నమ్మకాలు లేనప్పుడు నేనెలా ప్రారంభించినా ఎందుకభ్యంతరముండాలి? శంఖుస్థాపన గొయ్యి ఈశాన్యంలో తవ్వాలి. ఆఖరి గొయ్యి నైఋతిలో తవ్వాలి. కాంక్రీట్ స్తంభాలూ, నేలబారు దూలాలూ వెయ్యడం నైఋతి గొయ్యినించే ప్రారంభించాలి. గోడ కట్టుడూ, సెంట్రింగూ, పై దూలాలూ, స్లాబూ అన్నీ నైఋతి నుంచి మొదలు పెట్టి ఈశాన్యం వైపు చివరగా పూర్తి చెయ్యాలి. ఈశాన్య దిశ నుంచి నిర్మాణ కార్యక్రమం మొదలుపెట్టే మేస్త్రీ మీకు మనదేశంలో కనబడితే చెవి కోసిస్తాను. వాస్తు విరుద్ధంగా ఉన్న ప్లాన్ ప్రకారం ఇల్లు కట్టడానికి ఒప్పుకున్నందుకు సంతోషించండి. కాదంటారూ, మరొకర్ని వెతుక్కోండి. ఎవరూ దొరక్క తిరిగి నాదగ్గరకొస్తే మట్టుకు నా రేటు పెంచేస్తాను, ఆ పైన మీ యిష్టం" అన్నాడు మేస్త్రి మొండిగా.

మేస్త్రి వాదంలో కొంచెం తర్కమూ, వాస్తవమూ ఉన్నాయనిపించింది గృహ్‌కి. సరేనని ఒప్పేసుకున్నాడు. మొగుడి తంతు చూసి గృహికి చికాకనిపించింది.

"నిక్షేపంలా పట్టుచీర కట్టుకొని, వడ్డాణం పెట్టుకొని పీటల మీద కూర్చుందామన్న ముచ్చట మీద ముగ్గునీళ్ళు చల్లేశారు" అంది గృహి బుంగ మూతి పెట్టి.

"అర్ధరాత్రి ముహూర్తానికెవడొస్తాడు కనక? ఊరు బయటి స్థలం హడావుడి చూసి ఏ దొంగలో వచ్చి నాలుగు తన్ని దోచుకుపోవచ్చు. కట్టేది మన యిల్లే కనక చుట్టపు చూపుగా వెళ్ళి, మేస్త్రి సరదా చూసొచ్చేద్దాం లేకపోతే నొచ్చుకుంటాడు" అన్నాడు గృహ్. గృహికామాటలంతగా రుచించలేదు.

మేస్త్రి మొదటి గునపం పోటు వేసినప్పుడు గృహ్ తుమ్మాలని ఎంత ప్రయత్నించినా, ఆ ప్రయత్నం సఫలం కాలేదు.

ఎలక్ట్రిసిటీ బోర్డు వాళ్ళకి అర్జీ పెట్టుకొని తాత్కాలిక కనెక్షన్ తీసుకున్నాడు. ఛార్జీలే కాకుండా ముడుపుల షాక్ కూడా తగిలింది. అది రాగానే బోరు తవ్వించాడు. అనుకున్నదాని కంటే యిరవై అడుగులు లోతుకు వెళ్ళాల్సి వచ్చింది. నీళ్ళు పడగానే మేస్త్రి పని మొదలుపెట్టాడు. నిర్మాణం చకచకా సాగిపోయింది. చూస్తుండగానే యిల్లు లేచిపోయింది. కొత్తరకం సిమెంటు, సజావైన పాళ్ళూ అంటూ మేస్త్రి సెంట్రింగ్ టైమూ తగ్గించేశాడు, తడుపుడు కార్యక్రమమూ తగ్గించేశాడు. కనబడకుండా నీటి గొట్టాల్ని, ఎలక్ట్రికల్ వైరింగ్‌నీ అమర్చేశారు.

రాజస్థాన్ పాలరాతితో ఫ్లోరింగూ, పిచ్చిగ్గూళ్ళ షో కేసులూ పూర్తయిపోయాయి. గృహి ఎంపిక చేసిన రంగుల వెల్లలు వేయబడ్డాయి. ప్రహరీ గోడలకీ, యింటికీ మధ్యనున్న ప్రాంగణంతో పాటి మట్టి నింపడం జరిగింది. అందమైన తలుపుతో యిల్లూ, నల్లటి ఇనప ఊచల గేటులో ప్రహరీ గోడా మెరిసిపోసాగాయి. ఇల్లు అన్ని విధాలా పూర్తయిపోయింది. గృహ్ ఒక దీర్ఘ నిశ్వాసం విడిచాడు.

గృహప్రవేశమో! అన్నారు బంధుమిత్రులందరూ. రర్ పనికిరాదన్నాడు. ఆ పేరుతో కాక పోయినా కొత్తిల్లు కట్టుకున్నందుకు పార్టీ అయినా ఇమ్మన్నారు.

"దానికేం? నిరభ్యంతరంగా గ్రాండ్ పార్టీ ఇస్తాను. ఎల్లుండి సాయంత్రం, అంటే ఆదివారం సాయంత్రం ఆరింటికి మా యింటి లాన్‌లో గ్రాండ్ పార్టీ ఇస్తాను యిదే ఆహ్వానం కూడా" అంటూ అందరికీ భరోసా ఇచ్చాడు.

పూర్వకాలాల్లో ప్రభువుల మందిరాలను నిర్మించే శిల్పుల చేతులు ఖండించేవారు. ఈ కాలంలో ఇల్లు కట్టిన శ్రామికులను తాము కట్టిన గృహాల యజమానులు కనీసం గృహప్రవేశ భోజనాలకున్నూడా పిలవటల్లేదు. గృహ్ మేస్త్రీని, అతని ముఠాలో పన్జేసిన ముప్ఫై మందినీ పార్టీకి ఆహ్వానించాడు.

అనుకొన్న ఆ ఆదివారం రోజు సాయంత్రం ఆరు గంటలకందరూ గేటు బయట, రోడ్డు మీద గుమిగూడారు. గేటు తలుపు మూసి అడ్డంగా ఎర్రటి సిల్కు రిబ్బను కట్టారు. గృహి వెండి కత్తెరతో రిబ్బన్ కట్ చేసింది.

అందరూ ఆనందోద్రేకాలతో చప్పట్లు ఆగకుండా కొట్టారు. ఆ చప్పట్ల ధ్వనిలో ముందు నెమ్మదిగా మొదలైన గరగర శబ్దాల్ని ఎవరూ ఆలకించలేదు. చప్పట్లు ఆగగానే గృహ్ తమ్ముడు ఔటు పేల్చాడు. గృహ్ గేటు తలుపు తోస్తూండగా, పటపటమని శబ్దాలు చేస్తూ కలలు కని కట్టించుకున్న కొత్తిల్లు కుప్పకూలింది.

శాస్త్ర విరుద్ధంగా వెళితే ఇలా జరక్కేం చేస్తుంది? అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు అవలేదు. అందుకు సంతోషించు అని శాంతి ప్రవచనాలు పలికి, వచ్చినవారందరూ చల్లగా జారుకున్నారు.

పే బిల్ లోంచి వడ్డీతో సహా నెలసరి వాయిదా సొమ్ము ఋణమిచ్చిన బ్యాంక్‌లో జమ అవుతూనే ఉంది. కుప్పకూలిన కాంక్రీటు స్లాబులూ యిటుక గోడలూ గృహ్‌ని వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఓదార్చే ప్రతివారూ వాస్తుని గురించి ప్రస్తావిస్తూనే ఉన్నారు. శాస్త్రాన్ని నమ్మనందుకు కాదు కానీ, సాటి మానవులైన విశ్వకర్మనీ, కంట్రాక్టర్నీ నమ్మినందుకు గృహ్ బాధపడుతూనే ఉన్నాడు. ఎన్నో ప్రజాహిత ప్రణాళికలపై ఆశలు పెంచుకున్న దేశ్ పరిస్థితీ ఇందుకు భిన్నంగా లేదు. ❊



## రామరావణులు

ఎన్.టి.రామారావు రాజకీయ రంగప్రవేశం చేసినప్పుడు ఆడియో టేపు ప్రసంగాలతో, చైతన్యరథ యాత్రలతో ఆంధ్రప్రదేశ్‌ని అదరగొట్టేశాడు. ఉధృతంగా చేసిన ప్రచారానికి రాష్ట్ర ప్రజలు అనూహ్యమైన రీతిలో స్పందించడంతో రాష్ట్ర కాంగ్రెసు నేతలకు దడపుట్టి, ఢిల్లీకి పోయి ఇందిరమ్మతో మొరపెట్టుకున్నారు. ఎవరీ ఎన్టీ రామారావని ఇందిరమ్మ ప్రశ్నించగా ఆయనొక ప్రఖ్యాత చలనచిత్ర నటుడనీ, రాముడూ, కృష్ణుడూలాంటి పురాణ పాత్రలలో జీవించి ప్రజల మన్ననలకు పాత్రుడైనవాడనీ చెప్పారు.

"అయితే అతనికి ప్రతి సవాలుగా రావణుడూ, కంసుడూ పాత్రలలో నటించే నటుల్ని రాజకీయ రంగంలోకి దింపండి" అని సలహా ఇచ్చిందావిడ.

దానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఆ పాత్రల్నీ ఎన్టీఆర్ సినిమా రంగంలో దున్నేసి నటించాడు అన్నారు లోగొంతుకతో.

కేవలం ఒకే ఒక వ్యక్తి తన ప్రథమ ప్రయత్నంలోనే ఏళ్ళ తరబడీ పాతుకుపోయిన ఓ జాతీయ వ్యవస్థని పునాదులతోసహా కదిలించి, తాను స్థాపించిన పార్టీని అధికారంలోకి తీసుకు రావడం చిత్రమే కదా!

**- ఎలక్ట్రాన్**

## ఏ.వి.ఎమ్ @ వర్మ రన్నింగ్ కామెంట్రీ.కామ్

